

‘పొగ’ పెట్టిన కంపెనీలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మీరు పంటను వేయండి మేము కొనేస్తామంటూ తీయటి మాటలతో రైతులను మభ్యపెట్టారు కంపెనీ యజమానులు. కోటి ఆశలతో రైతులు పొగాకు సాగు చేశారు. తీరా పంట అమ్మేందుకు వెళితే అడ్డగోలు నిబంధనలతో కంపెనీలు అన్నదాతలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. గత ఏడాది పొగాకు లాభాలు కురిపించాయి. దీంతో పొగాకుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. గత సంవత్సరం వివిఎస్‌టి, ఐటిసి, జిపిఐ తదితర కంపెనీలు వారి ఏజెంట్లు పొగాకు సాగు చేయాలని గిట్టుబాటు ధర ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో గత ఏడాదితో పోలిస్తే మూడు రెట్లు పొగాను ఎక్కువగా సాగు చేశారు. కంపెనీలు రైతుల వద్దకే వచ్చి కొంటామని గత ఏడాది క్వింటాలుకు రూ.15000 నుంచి రూ.16500 వరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా సాగు చేస్తే రైతుల వద్దకే వచ్చి కొంటామని కంపెనీలు తెలియజేస్తాయి. అయితే ప్రస్తుతం పొగాకు రైతుల ఇళ్లల్లో పొగాకు బెళ్ళు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి పంటను కాపాడు కునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అటు పొగాకును ఇంట్లో దాచుకోలేక, మార్కెట్లో విక్రయించుకోలేక నరక వేదన అనుభవిస్తున్నారు. రైతుకు విత్తనాలు ఇచ్చి, నాటే పద్ధతులు పెంచే విధానం పొగాకు ఆరబెట్టె విధానం తెలియజేశారు. చివరికి పంట చేతికి రాగానే ఆకు బాలేదు అంటూ సాకులు పెడుతున్నారు. పొగాకు పంట చేతికి వచ్చిన తర్వాత రూ.18,000 ఇస్తామని చెప్పిన వారు ఇప్పుడు కనీసం రూ.పదివేలు కూడా అడగడం లేదు. పొగాకు సాగుకు ఎగరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. కొందరు కంపెనీ ప్రతినిధులు క్రిష్ణగిరి, తుగ్గలి, మద్దికేరా తదితర మండల పరిధిలో పలువురు రైతుల దగ్గరికి వెళ్లి పొగాకు సాగు చేస్తే ఎకరాకు రూ 4,500 ప్రకారం నారు విత్తనాలు ఇస్తామని పంట చేతికి వచ్చిన తర్వాత దిగుబడి ఎలా ఉన్నా పొగాకు రూ.18000 చొప్పున కొనుగోలు చేస్తామని నమ్మ పలికారు. పొగాకు పంట క్వింటాలుకు రూ.18 వేలు ఇస్తామని చెప్పిన వారు ఇప్పుడు కనీసం రూ.5000లకు కూడా అడగడం లేదు. సాధారణంగా పొగాకును అమ్మే ందుకు రైతులకు కేంద్రాలకు మాత్రమే తరలించాలి. కూరగాయల మాదిరిగా వివిధ ప్రాంతాలకు తరలించాల్సిన అవశ్యకత ఉండదు. రైతుల బేళ్లను కంపెనీకి తీసుకెళ్లిన తర్వాత కేవలం ఒకటి రెండు బేళ్లను మాత్రమే కొనుగోలు చేసి మిగతా బేళ్లనును నాణ్యత లేదని సాకుతో వెనక్కి పంపుతున్నారు. దీనివలన రైతులు అత్యంత దారుణంగా మోసపోతున్నారు. కొందరు వ్యాపారులు నామాత్రపు ధరను చెల్లించి రైతులను దగా చేశారు. క్వింటాలు రూ.5 నుంచి 6 వేల మించి పలకడం లేదని రైతులు వాపోతున్నారు. నాణ్యత పేరుతో వెనక్కి తిరిగి పంపుతున్నారు. దీంతో రైతులకు రాను, పోను రవాణాచార్జీల భారం అదనంగా చేరింది.

అక్కడే తాగడానికి ‘పర్మిట్’ : మద్యం అమ్మకాలకు కూటమి ప్రభుత్వం, అధికారులు గేట్లు ఎత్తేశారు. మద్యం దుకాణాల పక్కనే అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేసి మద్యాన్ని తాగనిస్తున్నారు. దీంతో కర్నూలు జిల్లాలో మద్యం ఏరులై పారుతున్న పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో మద్యంతోపాటు నాటుసారా అమ్మకాలు విచ్చలవిడిగా సాగగా, కూటమి ప్రభుత్వంలోనూ పరిస్థితి అలానే తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పాలకులు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నడిపించారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా ధరలు విపరీతంగా పెంచేసి మద్యం అమ్మకాలను జోరుగా సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సైతం మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగించేందుకు గేట్లు ఎత్తేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత మద్యం విధానంలో మార్పులు తెచ్చారు. గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు సాగగా, కూటమి ప్రభుత్వం ప్రయివేటుకు అప్పగించింది. కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలను, నంద్యాల జిల్లాలో 105 దుకాణాలను, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 204 మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. మద్యం దుకాణం దక్కించుకున్నవారు నాన్ రిఫండబుల్ ఫండ్ కింద రూ.రెండు లక్షలు చెల్లించారు. రెండేళ్లలో రూ.60 లక్షలు లైసెన్స్ ఫీజు కింద చెల్లించారు. దీంతో పెట్టిన సొమ్ము రాబట్టుకోవడంతోపాటు భారీగా లాభాలు ఆర్జించేందుకు వ్యాపారులు, నేతలు ప్రణాళికలు రచించారు. మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించేందుకు అనుమతి లేదు. అయినా మద్యం దుకాణాల నిర్వాహకులు మద్యం దుకాణాల వెనకల, పక్కన రేకుల షెడ్లు వేసి అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. అక్కడే ఫుల్లుగా తాగేలా సకల మర్యాదలూ చేస్తున్నారు. దీంతో మద్యం దుకాణాల ముందు మహిళలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రాలతో పాటు పలు పట్టణాల నడిబొడ్డున కూడా ఈ తతంగం సాగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి మామూళ్ళు అందుతుండటంతో అధికారులు కూడా అనధికార పర్మిట్ రూములకు సహకరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



డ్రోన్ టెక్నాలజీపై అవగాహన అవసరం

- ఎన్‌టిఆర్ వైద్య సేవపై విజిలెన్స్ కమిటీతో పర్యవేక్షణ -20 ఏళ్లు దాటిన పాఠశాల భవనాల తనిఖీ
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ - జెడ్‌పి సర్వసభ్య సమావేశానికి ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరు
- ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు డుమ్మా

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని రైతులు వాడుకునేలా అవగాహన కల్పించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, అనుబంధ శాఖలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, పారిశుధ్యం అంశాల పై చర్చించారు. డ్రోన్‌ల మంజూరుకు సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం 35 కాగా ఇందులో 17 గ్రూపులను ఏర్పాటు చేశామని, జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. మిగిలిన రైతు గ్రూపులను కూడా త్వరితగతిన ఏర్పాటు చేసి లక్ష్యాన్ని సాధించాలని మంత్రి ఆదేశించారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకం ద్వారా నెట్వర్క్ ఆస్పత్రులు రోగుల నుండి డబ్బు తీసుకుంటున్నారని ఆదోని ఎమ్మెల్యే ప్రస్తావించారు. మంత్రి స్పందించి పథకం సక్రమంగా అమలయ్యేలా విజిలెన్స్ కమిటీని వేసి పర్యవేక్షించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ‘ప్రభుత్వాస్పతుల్లో ఆక్సిజన్ అంశంలో లక్షలు, కోట్లు ఖర్చు పెడుతున్నారు. అంత ధర ఉందా..? ఈ అంశం మీద దృష్టి పెట్టి, వెరిఫై చేయాలి’ అని మంత్రి డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. ఐసియు పరికరాలను సిఎంసిలో తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యంకు సంబంధించి బ్లీచింగ్ పౌడర్‌లో నాణ్యత ఉండాలని, స్థానికంగా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే చోట నుంచి సరఫరా చేస్తే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని మంత్రి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 20 నుండి 25 సంవత్సరాలు దాటిన పాఠశాలల భవనాల స్థితిని తనిఖీ చేయించాలని ఉమ్మడి జిల్లాల డిఇఒలను ఆదేశించారు. హంద్రీ నది మొదలు నుండి ఓల్డ్ టౌన్ చివర తుంగభద్రలో కలిసే వరకు సిల్ట్ బాగా పెరిగిపోయిందని, కొంచెం వరద వచ్చినా, సమీపంలో నివాసం ఉండే ఇళ్లల్లోకి నీరు వెళ్లే అవకాశం ఉందన్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేయమని చెప్పామని, చేశారా అని మంత్రి ఇరిగేషన్ ఎస్‌ఇని అడిగారు. ప్రతిపాదనలు పంపామని ఎస్ఇ మంత్రికి తెలిపారు. ఒక కాపీ తనకు కూడా ఇవ్వాలని మంత్రి ఇరిగేషన్ ఎస్‌ఇని ఆదేశించారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన పదవ తరగతి మూల్యాంకనంలో చాలా పొరపాట్లు జరగడం వల్ల విద్యార్థులు మానసిక క్షోభకు గురయ్యారన్నారను. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ కౌతాళం మండలంలో దాదాపు 300 ఎకరాల్లో పండ్ల తోటలు వేశారని, అయితే ఉద్యాన శాఖ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందించడం లేదన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 80శాతం వర్షపాతం నమోదు కావడం వల్ల విత్తనం వేస్తున్నారని, రైతులు ఎక్కువగా పత్తి విత్తనం సాగు చేస్తున్నందువల్ల పత్తి విత్తనాలకు సబ్సిడీ ఇవ్వాలని సూచించారు. గత 10 సంవత్సరాలుగా సి.బెలగల్ లో సీడ్ పత్తి సాగు చేస్తున్నామని, ఇప్పుడు 300 ఎకరాలలో పత్తి విత్తనం వేసిన తరువాత వాటిని తీసివేయాలని కంపెనీ వారు చెబుతున్నారని సి.బెలగల్ మండల ఎంపిపి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా స్పందించి వెరిఫై చేసి తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 3 పొగాకు కంపెనీలతో మాట్లాడి వారితో పొగాకు కొనుగోలు చేయించామన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కంపెనీలు పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆళ్లగడ్డలో బ్లడ్ బ్యాంకు , ట్రామా కేర్ సెంటర్‌ను ర్పాటు చేయాలని కోరారు. ఆళ్లగడ్డలో శిల్పా వెంచర్‌కు అనుమతులు లేకుండా కెసి కెనాల్ పక్కన వేశారని, దీనివల్ల 7 వేల ఎకరాలకు నీరు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదోని, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు తప్ప మిగతా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఉమ్మడి జిల్లా ఇద్దరు మంత్రులు హాజరు కాకపోవడం గమనార్హం. జెసి బి.నవ్య, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్, వాల్మీకి సంఘం చైర్మన్ బొజ్జమ్మ, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భర్ద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్, జడ్‌పి సిఇఒ, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్. పక్కన కలెక్టర్లు రంజిత్ బాషా, రాజకుమారి



సమావేశానికి హాజరయిన సభ్యులు

‘సచివాలయ’ బదిలీల్లో అవకతవకలు

- ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసులు ఉంటే కోరుకున్న చోటికి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఫారస్ ఉంటే కోరుకున్న ప్రాంతం...లేకుంటే అంతే.మూడు అప్షన్‌లతో గందరగోళమని, బహిరంగ ప్రకటనతో బదిలీలు చేపట్టాలను సచివాలయ ఉద్యోగుల జెఎసి నాయకులు శివ ప్రసాద్ కోరారు. కర్నూలు నగరంలో శనివారం ఎస్‌బిఐ కాలనీలోని కౌన్సిల్ హాలులో కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆధ్వర్యంలో సచివాలయం ఉద్యోగుల బదిలీ కౌన్సిలింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కౌన్సిలింగులో అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నట్లు సచివాలయం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు శివప్రసాద్, అలీ, భాస్కర్, జ్యోత్స్న, తారకేశ్వర్ రెడ్డి, అమర్‌నాథ్, ప్రసాద్, సచివాలయం సెక్రటరీలు, ఉద్యోగులు తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను కర్నూలు కమిషనర్ తుంగలో తొక్కారని అన్నారు. ఎన్నడూలేని విధంగా రాత్రికి రాత్రే సొంత నిర్ణయాలు చేసి సచివాలయం ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ ప్రకటన విడుదల చేసి బదిలీ ప్రాంతాలు కేటాయించాలని, నగర పాలక కమిషనర్ సొంత నిర్ణయం పాటిస్తూ మూడు ఆప్షన్‌ల విధానం పాటించడం తగదన్నారు. ఆ విధానం ద్వారా జిల్లాలోని 133 సచివాలయాల్లో 1300 మంది ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగే పరిస్థితి నెలకొందని అన్నారు. మరో వైపు ఎమ్మెల్యేల సిఫారస్ లేఖలు ఉన్న వారికే మాత్రమే గుట్టుగా కోరుకున్న ప్రాంతాలు కేటాయిస్తున్నట్లు తెలుస్తోందని చెపుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు అప్షన్ల విధానం ఎందుకు తీసుకువచ్చారని అన్నారు. కనీసం సీరియల్ నెంబర్‌తో పనిలేకుండా సీనియరిటి పాటించకుండా బదిలలు చేయడం దుర్మార్గం అని ఆవేదన చెందుతున్నారు. కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సచివాలయం కానిస్టేబుల్ బదిలీల్లో పారదర్శకత పాటించారని చెప్పారు. కమిషనర్ రవీంద్ర బాబు పారదర్శకతను పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం తగదన్నారు. వారి వ్యవహారం చూస్తుంటే పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తున్నట్లుగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సచివాలయం ఉద్యోగుల బదిలీల్లో అందరికి ఆమోదయోగ్యంగా బదిలీలు చేపట్టాలని, లేనిపక్షంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోరతామని తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌లో జిల్లా వ్యాప్తంగా సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సహకార సొసైటీలకు త్రీమెన్ కమిటీలు

- అభ్యర్థుల ఎంపిక

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

సహకార సొసైటీలకు త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా శనివారం విడుదలదైంది. కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్‌లు) ఉన్నాయి. వాటికి ఒక ఛైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులను ఎంపిక చేశారు. ఆ జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. అక్కడి నుంచి అనుమతి వచ్చిన తరువాత తుది జాబితా ఉత్తర్వులను జారీ చేయనున్నారు.

హైకోర్టు జడ్జికి ఎస్‌పి స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని ప్రభుత్వ అతిథిగృహంలో హైకోర్టు జడ్జి జస్టిస్ బిఎస్. భానుమతిని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.





చైర్మన్ తలారి రంగప్పను, మెంబర్ సురేంద్రను సన్మానిస్తున్న టిడిపి కార్యకర్తలు

పత్తికొండ సొసైటీ చైర్మన్ గా తలారి రంగప్ప

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘం చైర్మన్ గా తలారి రంగప్పను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులు సొసైటీ చైర్మన్ తలారి రంగప్పను, సొసైటీ మెంబర్ కురువ సురేంద్రను పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. అనంతరం సొసైటీ చైర్మన్ రంగప్ప మాట్లాడుతూ పత్తికొండ సొసైటీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. నాపై ఎంతో నమ్మకంగా ఉన్నత పదవి, బాధ్యతలు అప్పి చెప్పినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆఫీసు ఇంచార్జ్ హరినాథ్ గౌడ్, ఎబిఎన్ పకీరప్ప, పెద్ద హుల్తి సర్పంచి తిప్పన, రమేష్, తాజ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డిని సన్మానిస్తున్న సొసైటీచైర్మన్ రమణ

ఉలిందకొండ సొసైటీ చైర్మన్‌గా ఇవి రమణ

ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డిని కలిసిన ఇవి రమణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ఉలిందకొండ సింగిల్ విండో సొసైటీ చైర్మన్‌గా ఇవి రమణ ను ప్రభుత్వం నియ మించింది. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డుకు, ఉప ముఖ్యమంత్రి ‘పవన్ కళ్యాణ్‌కు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి నందికొట్కూరు టిడిపి ఇంచార్జి సీనియర్ నాయకులు గౌరు వెంకట్‌రెడ్డికి, పాణ్యం యువ నేతగౌరు జనార్ధన్ రెడ్డికి..టిడిపి నాయకులకు కార్యకర్తలకు. ఉలిందకొంగ గ్రామ ప్రజలకు పత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నగరంలోని మాధవి నగర్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని సొసైటీ చైర్మన్ ఇవి రమణ తమ గ్రామస్తులతో కలిసి పుష్పగుచ్చం పూలమాలవేసి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. చైర్మన్ పదవి ఇప్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

కలుషిత నీటిని అరికట్టాలి

-ఫిల్టర్ చేసిన తాగు నీటిని ప్రజలకు అందించాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం పరిధిలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో తాగునీటి కులాయిలలో కలుషితమైన శుద్ధి చేయని వంద్రుతో కూడిన నీరు రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని సిపిఎం నగర కార్యదర్శి మాజీ కార్పొరేటర్ టి.రాముడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకసార్లు కొళాయిలలో శుద్ధి చేసిన తాగునీటికి బదులు కలుషితమైన ఒండ్రునీరు తరచూ వస్తున్నా కార్పొరేషన్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ఏమాత్రం పట్టడం లేదని అన్నారు. ప్రజలు ఈ నీరు తాగి విరోచనాలు, వాంతులు, జ్వరం, జలుబు లాంటి జబ్బులతో అనారోగ్యాలకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని కుళాయిల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. ఫిల్టర్ బెడ్ లో పనిచేస్తున్న కార్మికులు గత మూడు నెలలుగా సమ్మె చేస్తున్న పట్టించుకోవడంలేదని, వెంటనే కార్మికుల సమస్యను పరిష్కరించి ప్రజలకు తాగునీరు అందించే విషయంలో అశ్రద్ధ చేయకుండా కలెక్టర్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలుషిత నీటిని ఒండ్రు నీటిని అరికట్టి ప్రజలకు శుద్ధి చేసిననీరు కుళాయిల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.



ఇండ్లకు సరఫరా అయిన కలుషత నీటిని చూపుతున్న మహిళలు

గుప్తనిధుల తవ్వకాల కలకలం

-నెలకిందట పలుకుదొడ్డి -సి బెళగల్ రోడ్డులో పూజలు
-భయబ్రాంతులకు గురవుతున్న ప్రజలు

ప్రజాశక్తి- సి బెళగల్

పలుకుదొడ్డిలోని చెరువు తూముకు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి గుప్తనిధుల తవ్వకాల జరిగినట్లు కలకలం రేపుతోంది. ఇంత జరిగినా పోలీసులు కనీస స్పందన చూపి తగు విచారణ గాని, పరిశీలన గాని చేసినట్లు లేదు. ఇందులో భాగంగా మండలంలో పోలీసుల వైఫల్యం నిండుగా కనిపిస్తుందని స్థానికులు అంటున్నారు. మండలంలో ఓ సామాజిక వర్గానికి చెందిన ముఠా సంచారిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అలాంటి ముఠాలపై నిఘా వేయకుంటే ముమ్ముందు ఎందరో ఆరుబయట రాత్రి వేళ నిద్రపోయే చిన్న పిల్లలు, గర్భిణీలు, బాలింతలు కూడా క్షుద్రపూజల మాయలో మాయం చేసే వీలుందని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా నరబలులు వంటివి కూడా జరగడానికి ఏమాత్రం సంకోచించని ముఠాగా మారే అవకాశం ఉన్నట్లు మండలంలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.గత నెల క్రితం ఇదే పలుకు దొడ్డి రోడ్డులో ఒక కత్తి, ఒక నిమ్మకాయ, అగర్ బత్తిలు వంటివి పడేసి అక్కడే ఒక పంది తలకాయ పెట్టి అక్కడి ప్రాంత వాసులను ప్రయాణికులను భయబ్రాంతులకు గురి చేశారు. ఇకనైనా పోలీసులు మేలుకొని ఇలాంటి ముఠాలపై నిఘా వేసి చర్యలు చేపట్టి పునరావృతం కాకుండా చూడాలని పలువురు వాపోతున్నారు.



సి బెళగల్

రూ.4500 కోట్ల వ్యాపారాన్ని పెంచాలి

-రూ.1.24 లక్షల లాభాన్ని ఆర్జించిన కెడిసిసిబి బ్యాంక్
-చైర్మన్ ఆధ్వర్యంలో కెడిసిసి బ్యాంక్ మహాజన సభ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభ సమావేశం బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన శనివారం కెడిసిసి బ్యాంక్ పాతబస్తీ శాఖ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ మహాజన సభ సమావేశములో బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు 2024-25 కు సంబంధించి బ్యాంకు వ్యాపారా లావాదేవీలపై “పెన్ మొత్సా అసోసియేట్స్” చార్టర్డ్ అకౌంటెంట్ విశాఖపట్నం వారు నిర్వహించిన ఆడిట్ నివేదికను ప్రవేశపెట్టి మహాజన సభ్యుల ఆమోదానికి పెట్టారు. 2024-25లో బ్యాంకు రూ. 1.26లక్షలు నికర లాభం ఆర్జించినట్లు తెలిపారు. బ్యాంకు మహాజన సభ సభ్యులనుద్దేశించి బ్యాంకు ఛైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పర్సన్ ఇంచార్జి ఛైర్మన్లు, ముఖ్యకార్యనిర్వహణాధికారులు సంఘాల వ్యాపారం వృద్ధికి నిరంతర కృషి చేయాలని కోరారు. సంఘంలో డిపాజిట్లు సేకరించుటకు రైతులకు విరివిగా అన్ని రకాల రుణాలు మంజూరుకు గోల్డ్ లోన్స్, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం క్రింద సోలార్ యూనిట్లకు రుణాలు, ఎరువుల అమ్మకం ఇతర అన్ని రకాల వ్యాపారాలు చేసి సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. రైతులకు రుణాల మంజూరులో ఎటువంటి లోటు పాట్లకు అవకాశమివ్వకూడదని అన్నారు. బ్యాంకు యొక్క వ్యాపారములో 2025-26 సంవత్సరమునకు వ్యాపారాన్ని రూ.4000.00 కోట్ల నుండి రూ.4500.00. కోట్లకు పెంచాలని లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణ, నంద్యాల జిల్లా సహకార అధికారి ఎన్. రామాంజనేయులు, నాబార్డు అధికారి సుబ్బారెడ్డి , ఆప్కాబ్ ప్రతినిధి బి. దినేష్ , ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘముల పర్సన్ ఇంచాజి ఛైర్మన్లు, చేనేత సహకార సంఘాల చైర్మన్లు, సంఘాల సిబ్బంది , బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌శర్మ

బాలలు, యువత ఆరోగ్యంతో దేశభవిష్యత్తు

అంతర్‌జిల్లా రగ్బీ పోటీలను ప్రారంభంలో డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఏ దేశ భవిష్యత్తు అయినా ఆదేశ బాలల ,యువత మీద ఆధారపడి ఉంటుందని, వారు ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఉన్నప్పుడే ఆ దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల రగ్బీ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే ఆరోగ్యం, క్రమశిక్షణ అలబడుతుందని చెప్పారు. దేశ భవిష్యత్తు భావిభారత పౌరులైన చిన్నారులపై ఉందని, వారు క్రమశిక్షణ, అంకిత భావంతో ఎదిగినప్పుడే ఆ దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో అశాంతి నెలకొందని, పలు దేశాల మధ్య యుద్ధం కొనసాగుతుందని వివరించారు. ఇది ఆందోళనకర పరిణామం అని ఆయన వెల్లడించారు. ప్రతి ఒక్కరు చదువుకోవడం, వ్యాపారాలు చేయడం, ఉద్యోగం సంపాదించడం, తమకున్న జ్ఞానాన్ని ఇతరులకు పంచడం వంటి మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో మార్పులు తెచ్చుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ,శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. కర్నూలు నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామాంజ నేయులు, కొండేపోగు చిన్న సుంకన్న తో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పివికి ఘనంగా నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మాజీ ప్రధాన మంత్రి పివి నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శనివారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక డిసిసి కార్యాలయంలో జరిగిన జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, రాష్ట్ర ఐఎన్‌టియుసి ఫెడరేషన్ అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రి పాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు పగిడాల అమానుల్ల, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ ఎస్సీ బజారన్న, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఒబిసి జిల్లా చైర్మన్ డివి.సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.


సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

తాగునీటి సమస్య పరిష్కరించండి

- సిపిఎం నాయకులు - ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి- ఎమ్మిగనూరు

పట్టణంలోని రాఘవేంద్ర నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం పట్టణ నాయకులు బి.రాముడు, ఎం.అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలు మూడేళ్ల నుంచి తాగునీటి సమస్యతో, ఫ్లోరైడ్ నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలకులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా బుట్ట దాఖలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలకు రెండు పూటలా తాగునీటి కుళాయిలు సరఫరా చేస్తామని ఎమ్మెల్యే బీవీ బహిరంగ సభలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి ఏ ఒక్క అధికారి కూడా రావడం లేదని, ట్యాంకర్లు కూడా రావడం లేదని తెలిపారు. తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నా.. తాగునీటి సమస్య పరిష్కారంలో పైపులైన్లు వేసే ప్రక్రియను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. పేదలు ఉండే ప్రాంతంలో రూ.140 కోట్ల ప్యాకేజీతో పైపులైన్లు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ నీరు తప్ప మంచినీరు రావడం లేదని తెలిపారు. అనంతరం మున్సిపల్ డిఇ నీరజకు వినతిపత్రం అందజేశారు. ఆమె స్పందించి ట్యాంకర్లు పంపించారు. సిఐటియు, ఐద్వా నాయకులు పి.రాజు, బి.తిమ్మప్ప, నాగలింగ స్వామి, కృష్ణవేణి, పార్వతి, ఈరమ్మ, మాబున్ని, అంజినమ్మ, ఫాతిమా, తులసి, కేశమ్మ పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- కార్మిక సంఘాల నాయకులు


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

దేశవ్యాప్తంగా జులై 9న జరిగే సార్వత్రిక కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. శనివారం ఆదోని మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు కార్యదర్శి పిఎస్.గోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అజయ్ బాబు, పట్టణ అధ్యక్షులు భీమేష్, ఒబి.నాగరాజు, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, నాయకులు కృష్ణమూర్తి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జి.ఎంకప్ప, నాయకులు నారాయణ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 30న ప్రభుత్వ కార్యాలయాలకు సమ్మె నోటీసులు ఇవ్వడం, జులై 31 రౌండ్‌టేబుల్ సమావేశం, 7న బైక్ ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. 9న మంగళ ఆంజనేయస్వామి ఆలయం నుంచి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మిక, రైతు, వ్యకాస నాయకులందరూ హాజరు కావాలని కోరారు.

మురుగుదొడ్ల నిర్మాణంలో అధికారులు విఫలం

- కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్


చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫయాజ్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

మురుగుదొడ్లు కూలిపోయినా మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని నిజాముద్దీన్ కాలనీ కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ వాపోయారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ సిహెచ్.లోకేశ్వరి, కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజాముద్దీన్ కాలనీ, ఖాజీగడ్డ, ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం తగదని తెలిపారు. నిజాముద్దీన్ కాలనీలో గత 8 నెలల క్రితం మురుగుదొడ్లు కూలిపోయాయని, మరమ్మతులు చేయకపోవడంతో అవసరాలు తీర్చుకొనేందుకు ముళ్ల కంపల్లోకి వెళ్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొత్త మురుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. నిజాముద్దీన్ కాలనీలో ఇటీవల వేసిన బిటి రోడ్డుపై డ్రెయినేజీ లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తగిన డ్రెయినేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనార్టీ కాలనీ ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖాజీగడ్డ, ఎన్‌టిఆర్ నగర్, నిజాముద్దీన్ కాలనీ ప్రాంతాల్లో తాగునీటి కోసం వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలన్నారు.

రసాభాసగా కౌన్సిల్..!

- ఏకపక్ష నిర్ణయాలు తగదు
- అధికారులపై కౌన్సిలర్ల మండిపాటు

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలపై చర్చించాల్సిన కౌన్సిల్ సమావేశంలో వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఒకరిపైఒకరు నిందారోపణలు చేసుకోవడంతో రసాభాసగా సాగింది. మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి అధ్యక్షతన శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. కమిషనర్ కృష్ణ, హెల్త్ ఆఫీసర్ సందీప్, వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్ హాజరయ్యారు. పట్టణాభివృద్ధికి సహకరించాల్సిన అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ కౌన్సిలర్లను అవమానపరిచే ధోరణి అవలంభించడం తగదని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు మండిపడ్డారు. నిధుల వివరాలను చైర్మన్‌కు తెలియజేసి ప్రజా అవసరాల నిమిత్తం ఎలా ఉపయోగించాలో తెలపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కౌన్సిల్‌కు తెలియకుండానే పనులు చేపడుతూ అవమానపరచడం తగదని అన్నారు. ఇది అధికారుల పాలన కాదని గ్రహించాలని హితవు పలికారు. సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, సహకరించాలని అధికారులను కోరారు. 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు, దుబ్బ గణపతి వద్ద డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని మూడు నెలలుగా అడుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకే టిడిపి కౌన్సిలర్ అయినా ఒక పని జరగడం లేదని వాపోయారు. అమరావతి కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ మాట్లాడుతూ... అమరావతి నగర్ రోడ్డులో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలకు ఎలా ఫీజు వసూలు చేస్తారని సిపిఐ బాల మద్దిలేటిని నిలదీశారు. ప్రభుత్వ నిబంధన మేరకు నిర్మాణం, కట్టడాలు క్రమబద్ధీకరించవచ్చని కౌన్సిలర్‌కు తెలపాల్సిన అవసరం లేదని టిపిఐ బాల మద్దిలేటి తేల్చి చెప్పారు. తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని కౌన్సిలర్ లలితమ్మ పేర్కొన్నారు. కౌన్సిలర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ... ఆదోని అభివృద్ధికి వైసిపి అడ్డుపడుతుందని అవకాశం దొరికినప్పుడల్లా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడడం తగదన్నారు. ఎమ్మెల్యేగా ఆయన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి పట్టణానికి ఏ మేర నిధులు విడుదల చేయించారో తెలపాలని కమిషనర్ కృష్ణను ప్రశ్నించారు. పదేపదే వైసిపిపై ఏడవడం కాదని, చిత్తశుద్ధి ఉంటే నిధులు మంజూరు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని, తాము కూడా సహకరిస్తామని తెలిపారు. రెవెన్యూ ఆఫీసర్ నజీర్ హుస్సేన్, డిప్యూటీ ఇంజినీర్లు చలపతి రెడ్డి, గోపీనాథ్, రామ్మూర్తి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రంజిత్, హరినాథ్, కౌన్సిలర్లు ఉస్మాన్, ఫయాజ్, అశోక్, చలపతి, ఇందు, పద్మ, సురేష్, కీర్తన, పద్మావతి, మెప్మా ఆఫీసర్ వీరారెడ్డి ఉన్నారు.


చైర్మన్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

- 'మొహర్రం'ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- ఎస్ఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో మొహర్రం పండగను కలిసిమెలిసి ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పోలీసు స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అల్లరి మూకల ఆటలు సాగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పీర్ల పండగ (మొహర్రం) వేడుకల్లో గొడవలు చేస్తే తాటా తీస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో పండగ సమయంలో పార్టీలను మధ్యలోకి తీసుకురాకుండా ప్రతిఒక్కరూ కలిసిమెలిసి జరుపుకోవాలని సూచించారు. పండగ రోజు 'నీది నా పార్టీ. నాది నీ పార్టీ' అంటూ గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో పండగ జరుపుకునేందుకు డీఎస్పీ పేరు మీద చలానా తీసి పెద్ద మనుషులు సంతకాలు చేసి పోలీసు స్టేషన్‌లో చలానా కాగితం ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకే మొహర్రం పండగ జరుపుకోవాలన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, ఖాదర్ బాషా, భాస్కర్, నెల్లూరప్ప, శంకర్ పాల్గొన్నారు.


చిప్పగిరిలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

అనుమతి తప్పనిసరి : ఎస్ఐ మారుతి



హాలహర్వి : మొహర్రం పండగకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ మారుతి తెలిపారు. హాలహర్వి పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. మండలంలో మొహర్రం వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. వేడుకలు నిర్వహించే వారు మీసేవా కేంద్రంలో చలానా చెల్లించి పోలీసుల అనుమతి తప్పని సరిగా పొందాలని తెలిపారు. అనుమతి లేకుండా మొహర్రం వేడుకలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొహర్రం వేడుకల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పదవుల పందేరం..!

- సహకార సంఘం చైర్మన్ల ఎంపిక

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పదవుల పందేరం ప్రారంభమైంది. ఆయా సహకార సంఘాల చైర్మన్లను, సభ్యులను ఎంపిక చేశారు...

కౌతాళం చైర్మన్‌గా వెంకటపతి రాజు





కౌతాళం : కౌతాళం సహకార సంఘం చైర్మన్‌గా వెంకటపతి రాజు, సభ్యులుగా కురువ వీరేష్, నబి సాబ్, బదినేహాల్ సహకార సంఘం చైర్మన్‌గా మారెప్ప, సభ్యులుగా నరసింహులు, తోవి సోమనాథ్‌ను కూటమి ప్రభుత్వం నియమించినట్లు టిడిపి నాయకులు సంబరాలు ప్రారంభించారు. శనివారం డాక్టర్స్ సెల్ అధ్యక్షులు రాజానందు తన మిత్రుడు వెంకటపతిరాజుకు ముందుగానే శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం లభించడానికి కృషి చేసిన టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్యకు, ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డికి పార్టీ వర్గాలు అభినందనలు తెలియజేస్తున్నాయి. త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని పార్టీ శ్రేణులు తెలిపాయి.

ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు తెలిపిన గోపాల్



నందవరం : ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డికి ధర్మపురం గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. నందవరం మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సొసైటీ చైర్మన్‌గా ఆయనను పార్టీ అధిష్టానం ప్రకటించింది. వైస్ చైర్మన్‌గా మహేష్, డైరెక్టర్‌గా భీమ శేఖర్ నియమితులయ్యారు. సొసైటీ చైర్మన్ ధర్మాపురం గోపాల్ మాట్లాడారు. చైర్మన్‌గా తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, తన ఎంపికకు సహకరించిన టిడిపి మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

కైరవాడి చైర్మన్‌గా తిమ్మారెడ్డి



గోనెగండ్ల : టిడిపిలో నామినేటెడ్ పదవుల పందేరం ప్రారంభమైంది. మండలంలోని హెచ్.కైరవాడి వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బురుజుకాటి తిమ్మారెడ్డి ఎంపికయ్యారు. జిల్లా సహకార బ్యాంకు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందినట్లు సిఇఒ గోపాల్ రెడ్డి శనివారం తెలిపారు. గుంటూరులోని రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్యాలయం నుంచి జిఒ అందిన వెంటనే బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కొన్నేళ్లుగా రాష్ట్రంలోని సహకార సంఘాలకు ఎన్నికలు జరగలేదు. గత ప్రభుత్వంలో సొసైటీల్లో నిర్వహణకు అధ్యక్షునితో పాటు మరో ఇద్దరు సభ్యులను ముగ్గురిని ఎంపిక చేసి త్రీ మెన్ కమిటీ విధానాన్ని అమలు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే త్రీమెన్ కమిటీ విధానాన్ని కొనసాగిస్తోంది. హెచ్.కైరవాడి సొసైటీకి అధ్యక్షునిగా బి.తిమ్మారెడ్డిని, సభ్యులుగా పెద్దనేలటూరు గ్రామానికి చెందిన ఎం.ఆనందం, పుట్టపాశం గ్రామానికి చెందిన బీసీ.పెద్ద వెంకటరాముడును ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఎంపిక చేశారు.

రేసులో ఇద్దరు టిడిపి నాయకులు

ప్రజాశక్తి -దేవనకొండ


రాజశేఖర్ గౌడ్


సుభాన్

దేవనకొండ సహకార సంఘం చైర్మన్ రేసులో ఇద్దరు టిడిపి నాయకులు పోటీలో ఉన్నారు. టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ గ్రూపునకు టిడిపి చెందిన ఈదుల దేవరబండ నాయకులు హెచ్.సుభాన్, ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్ గ్రూపునకు చెందిన పల్లెదొడ్డి రాజశేఖర్ గౌడ్ రేసులో ఉన్నారు. టిడిపికి విధేయులుగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ స్థానిక, మండల పరిషత్, పంచాయతీ, నియోజకవర్గ ఎమ్మెల్యే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల విజయాల కోసం ఇద్దరూ కష్టపడి పనిచేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మండలంలో టిడిపి నాయకులు, మాజీ జడ్‌పిటిసి కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు హత్య అనంతరం జరిగిన సహకార సొసైటీ ఎన్నికల్లో పల్లెదొడ్డి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రాజశేఖర్ గౌడ్ సహకార సొసైటీ చైర్మన్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకు రాగా ఆయనపై మద్దిలేటి నాయుడు గ్రూపు దాడికి పాల్పడింది. టిడిపి నుంచి గట్టి పోటీ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ వర్గానికి చెందిన మద్దిలేటి నాయుడు తల్లి లక్ష్మీదేవి సహకార సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కర్నూలు జిల్లాలో ఆదోని, ఆలూరు నియోజకవర్గాలు తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో సహకార సొసైటీ చైర్మన్ అభ్యర్థుల పేర్లను టిడిపి ప్రకటించింది. ప్రస్తుతం టిడిపిలో మండలంలో వైకుంఠం శివప్రసాద్, వీర భద్ర గౌడ్ గ్రూపులతో నాయకులు, కార్యకర్తలు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. దేవనకొండ మండల సహకార సొసైటీ చైర్మన్ ఏ గ్రూపునకు వరిస్తుందోనని పార్టీ అభిమానులు, సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.


రక్తదానం చేస్తున్న మల్లికార్జున

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హోళగుంద

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున తెలిపారు. శనివారం ఆదోని పట్టణంలో పెద్దహోతూరు గ్రామానికి చెందిన వ్యక్తికి అత్యవసరంగా రక్తం కావాలంటే ఆదోని బ్లడ్ బ్యాంకులో 9వ సారి రక్త దానం చేశారు. ఆయన మాట్లాడుతూ... యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, రక్తదానం వల్ల మరింత ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు.

మాజీ కౌన్సిలర్, ఎంఆర్‌పిఎస్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - ఆదోని


గోవిందరాజులు (ఫైల్)

మాజీ కౌన్సిలర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పగడాల గోవిందరాజులు (60) అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు వివరాల మేరకు... గోవిందరాజులు కొంతకాలంగా షుగర్, బిపితో చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం ఇందిరా నగర్‌లో వారి నివాసంలో గోవిందరాజులు మృతదేహానికి పలువురు పూలమాలలతో నివాళులర్పించారు. గోవిందరాజులు 2005లో ఇంద్రనగర్ కౌన్సిలర్‌గా పనిచేశారు. ఎంఆర్‌పిఎస్‌లో ముఖ్య నాయకుడుగా ఉంటూ ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరం పోరాటం చేశారని కౌన్సిలర్ చలపతి, వైసిపి అధ్యక్షులు దేవా తెలిపారు. ఆయన మృతి బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. అలాగే సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, ఎంఆర్‌పిఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు బాలస్వామి నివాళులర్పించారు.

వికలాంగులకు బ్యాటరీ వాహనాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ మండలంలోని హుసేనాపురం గ్రామంలో వికలాంగులకు బ్యాటరీ వాహనాలను టిటిడి బోర్డు మెంబర్, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మల్లెల జ్యోతి, హుస్సాపురం గ్రామ ప్రజలు టిడిపి కార్యకర్తలు పాలొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

- తుంగభద్ర నదిలో మృతదేహం

ప్రజాశక్తి - కౌతాళం


గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. తుంగభద్ర నదిలో హత్యకు గురైన వ్యక్తి మృతదేహం శనివారం వెలుగు చూసింది. మండలంలోని నదిచాగి గ్రామం సమీపంలో తుంగభద్ర నదిలో మృతదేహం ఉన్నట్లు చూసిన వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వ్యక్తి ముఖంపై యాసిడ్ పోసి, ఒక చెయ్యి నరికి వేసి, మర్మంగాలు కోసి ఉండడం చూస్తే అతి దారుణంగా హత్యకు పాల్పడినట్లు అర్థమవుతోంది. ఈ విషయం వ్యాపించడంతో ఫ్రాక్షన్ గ్రామమైన నదిచాగితో పాటు నదీతీర గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. మృతదేహం పడిన ప్రదేశాన్ని పరిశీలించగా కర్ణాటక పరిధిలోకి రావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కర్ణాటకలోని మాన్వి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు. కర్ణాటక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాన్వికి తరలించారు.

బంటుపల్లిలో ఘర్షణ...

- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని బంటుపల్లి గ్రామంలో పొలం తగాద విషయంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య శనివారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు, పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన వీరాంజనేయులు గౌడ్, ఈరన్న గౌడ్ ఇద్దరూ అన్నదమ్ములు. గత కొద్ది కాలంగా పొలం విషయంలో వివాదాలు నెలకొన్నాయి. ఈరన్న గౌడ్ అతని కుమారుడు శివపై వీరాంజనేయులు కుమారుడు హరికృష్ణ కట్టెలతో దాడి చేశారు. ఇరువురు తీవ్ర గాయాలకు గురయ్యారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన ఈరన్న గౌడ్

ఆధునిక వైద్యమే లక్ష్యం

- మాజీ ఎంపీ బుట్టా రేణుక
- డాక్టర్ రఘు ఆర్థో స్పైన్ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా రఘు ఆర్థో స్పైన్ ఆస్పత్రి నెలకొల్పారని, డాక్టర్ రఘు సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ, వైసిపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, ఆదోని మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి కోరారు. శనివారం పట్టణంలోని భీమాస్ కూడలిలో డాక్టర్ రఘు ఆర్థో స్పైన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎముకలు, వెన్నెముక వ్యాధిగ్రస్తులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు, హైదరాబాద్, బెంగుళూరు, బళ్లారి ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. డాక్టర్ రఘు ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. ఇప్పటికే వందలాదిమంది రోగులకు ఆపరేషన్ చేసి పేరు గడించారన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ఉందని, ఉచిత ఆపరేషన్ కూడా నిర్వహిస్తారని తెలిపారు. డాక్టర్ రఘు ఆర్థో స్పైన్ హాస్పిటల్‌ను ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ రఘు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి ఎమ్మిగనూరు నాయకులు జగన్మోహన్ రెడ్డి ఉన్నారు.


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న బుట్టా రేణుక, డాక్టర్ రఘు

'చేనేత కార్మికులకు పట్టుపై సబ్సిడీ ఇవ్వాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేత కార్మికులకు పట్టుపై సబ్సిడీ ఇవ్వాలని చేతి వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు పి.గోవిందు, చేనేత కార్మిక సంఘం నాయకులు భరణి కాలప్ప, కామర్తి లక్ష్మన్న, కునే కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు చేనేత కార్మికుల సమావేశం భరణి కాలప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చేనేత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో వ్యవసాయం తర్వాత చేనేత వృత్తికి అధిక ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఎమ్మిగనూరులో దాదాపు 40 శాతం జనాభా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. పద్మశ్రీ మాచాని సోమప్ప ప్రారంభించిన ఎమ్మిగనూరు చేనేత కోఆపరేటివ్ సొసైటీ వైభవం కోల్పోయిందని తెలిపారు. సొసైటీకి నిధులు కేటాయించి అందరికీ పని కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. చేనేత కార్మికులు వీధుల్లో భిక్షమెత్తుతున్నా ప్రభుత్వాలు కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం గతంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసి చేనేత కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి, చంద్రబాబు నాయుడు శిలాఫలకాన్ని కూడా వేసి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అది నేటికీ అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 250 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని కోరారు. 50 శాతం సబ్సిడీతో రూ.2 లక్షలు బ్యాంకు రుణాలు ఇవ్వాలని, ప్రతి చేనేత కుటుంబానికి 3 సెంట్ల స్థలం కేటాయించి వర్క్ షెడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ వాగ్దానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రజాసంఘాలను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు రాముడు, చాయా శ్రీనివాసులు, కునిగిరి వెంకటేష్, గడిగే శ్రీను, కంచి గుండు శ్రీనివాసులు, కనికే శంకర్, మాదుగుండు ఎల్లప్ప, రాజు పాల్గొన్నారు.


సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న భరణి కాలప్ప

దైనందిన సేవకు రూ.లక్ష విరాళం

- మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో కొనసాగుతున్న దైనందిన సంపూర్ణ సేవకు రూ.లక్ష విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక పరిపాలన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన భక్తుడు ఆశిష్ దేశ్‌పాండే రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చినట్లు తెలిపారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించా రు. అనంతరం రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

దళారులను నమ్మొద్దు : రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు శీఘ్ర దర్శనం కోసం దళారులను నమ్మి మోసపోవద్దని మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో కొందరు కొత్త దందా మొదలు పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. స్వామి వారి దర్శనం త్వరగా కావాలంటే దగ్గరుండి చేయిస్తామని.. అందుకు కొంత డబ్బు చెల్లించాలని కోరుతున్నట్లు తెలిసిందని తెలిపారు. శ్రీమఠంలోని సెక్యూరిటీ గార్డులకు, ఇతర మఠం సిబ్బందికి, బయటి వ్యక్తులకు డబ్బులు చెల్లించి భక్తులు మోసపోవద్దని సూచించారు. అలాంటి శీఘ్ర దర్శనార్థమై సేవా టికెట్లు తీసుకొన్న వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. నకిలీ పరిమళ ప్రసాద విక్రయాలు జరుగుతున్నట్లు కూడా తెలిసిందని, వాటిని కొనుగోలు చేసి మోసపోవద్దని చెప్పారు. శీఘ్ర దర్శనార్థమై ఎవరైనా భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే శ్రీమఠం సిబ్బందిపైనా, సెక్యూరిటీ సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయటి వారు ఉన్నారని తెలిసినా పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు. శ్రీమఠం ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్ పాల్గొన్నారు.

రాంబాబుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం


ఆర్థిక సాయం అందజేస్తున్న లక్ష్మన్న

జనసేన కోడుమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాంబాబుకు మంత్రాలయం ఇన్‌ఛార్జీ, ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం ఆయన కర్నూలులోని కల్యాణి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాంబాబును పరామర్శించారు. లివర్ దెబ్బతిన్న కారణంగా హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేసిన నేపథ్యంలో ఆయన హాస్పిటల్ చేరుకొని ఆరోగ్య విషయాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. రూ.10 వేలు నగదు అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జగ్గాపురం చిన్న ఈరన్న ఉన్నారు.

'ఆర్ఎస్'పై చర్యలు తీసుకోవాలి

- జిల్లా అధికారులకు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆదోని


జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఆర్ఎస్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యంపై అధికారులు చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు అమర్ తెలిపారు. శనివారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఎఒ అరుణ కుమారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్ఎస్ హెల్త్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించాలని పలు దఫాలుగా సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు. పట్టణంలో ఉన్న ఆర్ఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్ అనుమతులు రాక ముందే అడ్మిషన్ ప్రారంభిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, యాజమాన్యంపై తీసుకోవాలని గత 15 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నామని చెప్పారు. సబ్ కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి స్కూల్ సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకున్నా జిఎన్ఎం, ఇతర హెల్త్ కోర్సుల పేరుతో వేలాది రూపాయలు ఫీజులు తీసుకుంటున్నారని తెలిపారు. వసతుల్లేక, ఫ్యాకల్టీ లేక విద్యాపరంగా విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మోసపోయే ప్రమాదం ఉందన్నారు. యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తనిఖీకి వచ్చిన అధికారులకు అప్పటికప్పుడే వేరే కళాశాల భవనాన్ని చూపించి బురిడి కొట్టించారని, విచారణ చేపట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక రోజు అద్దెకు ఇచ్చిన ఆ కళాశాల భవనం యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఉత్తేజ్, లోకేష్, ఉదయ్, ఉచ్చీరప్ప ఉన్నారు.

మెనూ పాటించాలి : ఎంఇఒ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ ఈరన్న

ప్రజాశక్తి - హాలహర్వి

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలని ఎంఇఒ ఈరన్న తెలిపారు. శనివారం ఆయన మండలం లోని హర్దగేరి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు చక్కగా పాఠాలను బోధిస్తున్నారో లేదో అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటలు నాణ్యత ప్రమాణాలతో ఉండాలని, మెనూ ప్రకారం ఉండాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.